# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా సుపరిపాలనను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శాసన సభ బడ్జెట్ సమావేశాల ప్రారంభ ప్రసంగంలో తెలిపారు.**

2. **శాసన బడ్జెట్ సభ సమావేశాల్లో భాగంగా ఈనెల 14న రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు.**

3 **రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సరళీకృతం చేసి, ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.**

4. **తెలుగు పాటకు గుర్తింపు తీసుకొచ్చిన అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి ఈరోజు.**

==========================

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సుపరిపాలనను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పరిపాలనా విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ ఎకనామిక్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సహా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి సారించిందని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులతో పాటు, మాజీ ముఖ్యమంత్రి వై. యస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యులు హాజరయ్యారు.

-------------------------

గవర్నర్ ప్రసంగం అనంతరం సభను వాయిదా వేసి శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన సభా వ్యవహారాల సలహా సంఘం - బిఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన సభ

అజెండా, నిర్వహణపై చర్చించారు. వచ్చే నెల 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈనెల 14వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టడంతో పాటు 17,18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ నిర్వహించనున్నారు. ఈనెల 18న బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి సమాధానం ఇవ్వనున్నారు. మొత్తం 17రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయని, అవసరమైతే మరికొన్ని రోజులు పొడిగించే అవకాశముందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో డ్రోన్ ల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ పురోగతిపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో డ్రోన్ల వినియోగం, ప్రజలలో అవగాహనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనార్థన్ రెడ్డి మాట్లాడుతూ, డ్రోన్లు వినియోగం భారీగా ఉన్నప్పటికీ, పైలెట్ల కొరత ఉందని చెప్పారు. ఐఐటీ, పాలిటెక్నిక్ వంటి కళాశాలల్లో డ్రోన్లకు సంబంధించిన పైలెట్లకు శిక్షణ ఇచ్చేందుకు సాంకేతిక నైపుణ్యాలను ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సరళీకృతం చేసి, ప్రాజెక్టులు త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.'ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమం అమలులో సంబంధిత సంస్థల సమన్వయంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ యూనిట్లను తక్కువ కాలంలో ఏర్పాటు చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణలో ఉన్న ఆదాయ సృష్టి కార్యక్రమాలను సూక్ష్మ పరిశ్రమలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

---------------------------

వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం-సీఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న సైక్లోథాన్-2026 కార్యక్రమం ప్రకాశం జిల్లాలోని ఒంగోలుకు నిన్న చేరుకుంది. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సీఐఎస్ఎఫ్ అధికారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సైక్లోథాన్‌లో పాల్గొంటున్న పారిశ్రామిక భద్రతా దళం కానిస్టేబుల్ సాయిబాబు మాట్లాడుతూ, తీర ప్రాంతం రక్షణ, మత్తు పదార్థాల అక్రమరవాణా కట్టడిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైక్లోథాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు ఈ రోజుతో ముగియనున్నాయి. ఉత్సవాలలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ తో కలిసి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, విజయవాడ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత

అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశంలో పేరుగాంచిన క్రైస్తవ పుణ్యక్షేత్రాలలో గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఒకటని అన్నారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలలో పాల్గొనటం ఆనందంగా వుందని తెలిపారు.

---------------------------

తెలుగు పాటకు గుర్తింపు తీసుకొచ్చిన అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి ఈరోజు. సంగీత దర్శకుడిగా, నేపథ్య గాయకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఘంటసాల 1922 డిసెంబర్ 4వ తేదీన కృష్ణా జిల్లా గుడివాడ వద్ద గల చౌటపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ సహా పలు భాషల్లో ఆయన అనేక గీతాలను ఆలపించారు. ఆయన స్వరాలాపాన చేసిన భగవద్గీత తెలుగునాట ప్రసిద్ధి పొందింది. మధురమైన స్వరంతో తెలుగు పాటలకు ప్రాణం పోసిన ఘంటసాల వెంకటేశ్వరరావు 1974 ఫిబ్రవరి 11 న తుది శ్వాస విడిచారు. తన ఆఖరి శ్వాస వరకు గానాన్ని కొనసాగిస్తానని ఘంటసాల ఒక సందర్భంలో పేర్కొంటూ...

వాయిస్ 30 సెకన్లు

---------------------------

పత్రికా సమాచార కార్యాలయం –పిఐబి డెహ్రాడూన్ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్‌కు చెందిన పాత్రికేయుల ప్రతినిధి బృందం విశాఖపట్నంలోని చారిత్రక ఐఎన్ఎస్ కుర్సూరా జలాంతర్గామి, టియు--142 విమాన మ్యూజియాలను నిన్న సందర్శించింది. ఈ సందర్భంగా టార్పెడో గది, కమాండ్ రూమ్, ఇంజిన్ విభాగాలను పరిశీలించిన బృందానికి నౌకాదళ వ్యూహాలు, సాంకేతిక సామర్థ్యాలపై పాత్రికేయుల కు అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రతినిధి బృందం సందర్శించింది. గిరిజన విద్యార్థులకు అందిస్తున్న విద్యా అవకాశాలపై ఇన్–చార్జ్ ఉపకులపతి టి. శ్రీనివాసన్ వారికి వివరించారు. ఈ సందర్భంగా పీఐబీ అసిస్టెంట్ డైరెక్టర్ సంజీవ్ సుందరియల్ మాట్లాడుతూ, దేశ వ్యూహాత్మక, సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునేందుకు ఇటువంటి పర్యటనలు ఉపయోగపడతాయని తెలిపారు

---------------------------

అన్న క్యాంటీన్ లలో శుభ్రతను పాటించాలని నంద్యాల పురపాలక కమిషనర్ బండి శేషన్న పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. నంద్యాలలోని బస్టాండ్ సమీపంలో అన్న క్యాంటీన్‌ను ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యత, రుచిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారాన్ని, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడం అత్యంత కీలకమని అన్నారు. బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజు సుమారు 1600 మందికి పైగా భోజనం చేస్తున్నారని తెలిపారు. ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండాలని, కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు.

=====================